క్లుప్తంగా

ఆదిలక్ష్మి అలంకరణలో సౌభాగ్యలక్ష్మి



సౌభాగ్యలక్ష్మి అమ్మవారు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సత్రంపాడు సౌభాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమ పూజలు చేశారు. మంగళగౌరీ వ్రతాలను ఆచరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి శ్రీ ఆదిలక్ష్మి అలంకరణ చేశారు.

డీఎస్పీని కలిసిన గారపాటి చౌదరి



డీఎస్పీకి శుభాకాంక్షలు తెలుపుతున్న గారపాటి

ఏలూరు (టూటౌన్): ఏలూరు డీఎస్పీగా మంగళవారం బాధ్యతలు స్వీకరించిన డి.శ్రవణ్ కుమార్‌ను డీఎస్పీ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ని దుశ్శాలువాతో సత్కరించి, పూల బొకేను అందజేశారు. ఏలూరు డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

చిల్డ్రన్స్ హోమ్ పరిశీలన



బాలలతో మాట్లాడుతున్న సూర్యచక్రవేణి

ఏలూరు (టూటౌన్): స్థానిక శనివారపుపేట నందుగల మేయర్ చిల్డ్రన్ హోమ్‌ను జిల్లా బాలల సంరక్షణాధికారి సీహెచ్ సూర్యచక్రవేణి, జిల్లా ప్రొబేషన్ ఆఫీసర్, చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్ నోడల్ ఆఫీసర్ జె.దుర్గాప్రసాద్ మంగళవారం సందర్శించారు. బాలలకు చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్ తరుపున కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. మేయర్ చిల్డ్రన్ హోమ్‌లో కంప్లెయింట్ బాక్స్ ఏర్పాటు చేశారు. ఈ హోమ్‌లో 45 మంది ఆశ్రయం పొందుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఇనిస్టిట్యూషనల్ కేర్ ఆఫీసర్ శ్రీకాంత్, ఔట్‌రీచ్ వర్కర్ రాజ్ కుమార్, హోమ్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత నైపుణ్యాలు పెంచుకోవాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులు చదువుకునే సమయంలోనే తమలోని వ్యక్తిగత నైపుణ్యాలు పెంపొందించుకోవాలని కెరీర్ కౌన్సిలర్ జి.ప్రవీణ్ కృష్ణ సూచించారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ, జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో స్థానిక బాలగంగాధర్ తిలక్ నగరపాలక ఉన్నత పాఠశాలలో వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చదవడం ద్వారా విజ్ఞానం సంపాదించాలన్నారు. కార్యక్రమంలో వెకేషనల్ గైడెన్స్ కోర్స్ ఈఓలు వి.వరలక్ష్మి, రామబ్రహ్మం, ప్రధానోపాధ్యాయుడు షడ్రక్, సెట్‌వెల్ మేనేజర్ పీవీఎస్ సత్యనారాయణ, పర్యవేక్షకుడు కేజే కెనడీ తదితరులు పాల్గొన్నారు.

డ్వామా అకౌంట్స్ ఆడిట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా), మండల కంప్యూటర్ సెంటర్ల అకౌంట్స్ ఆడిట్ చేసేందుకు ఆసక్తి గల రిజిస్టర్డ్, అనుభవం గల చార్టెడ్ అకౌంటెంట్ సంస్థల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పి.రాము మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఏలూరు కలెక్టరేట్ ఆవరణలోని డ్వామా కార్యాలయంలో సమర్పించాలని పీడీ రాము కోరారు.

ఎమ్మెల్యే దృష్టికి డ్రైవర్ల సమస్యలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న డ్రైవర్లకు పదోన్నతుల కల్పించాలని ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘం ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎమ్మెల్యే చంటిని కోరారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను యూనియన్ నాయకులు కలిశారు. నగరపాలక సంస్థ పరిధిలో 8 మంది పబ్లిక్ హెల్త్ డ్రైవర్లు, ఒక వాటర్ సప్లై పని చేస్తున్నారని, ఈ తొమ్మిది మందికి 2022 మార్చి 30న హెవీ వెహికల్స్ డ్రైవర్స్‌గా పదోన్నతి ఉత్తర్వులు ఇచ్చారని, పదోన్నతి వేతనాలు ఇంక్రిమెంట్లు ఇవ్వకుండా సంబంధిత అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని వివరించారు. డ్రైవర్ల పదోన్నతి విషయంలో రెగ్యులర్ కమిషనర్ రాగానే పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని తెలిపారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు, సహాయ కార్యదర్శి ఎస్ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలపై రాజకీయ జోక్యం

- గత ప్రభుత్వంలో అభివృద్ధి కోసం
- నేటి ప్రభుత్వం పెత్తనం కోసం
- 8న పాఠశాలల్లో ఎన్నికలు



ఏలూరు నగరంలోని కస్తూరిబా నగరపాలక ఉన్నత పాఠశాల

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సమాజంలో అన్ని రంగాల్లో తన ప్రాబల్యాన్ని చూపెడుతోంది. అప్పటి వరకూ ఉన్న వ్యవస్థలను మార్పు చేస్తూ ఆయా రంగాల్లో రాజకీయాలను చొప్పిస్తోంది. తాజాగా ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికల రూపంలో మరో అవకాశం వచ్చింది. కేవలం విద్యా వ్యవస్థ అభివృద్ధి కోసం ప్రారంభించిన ఈ ఎన్నికలు ఈ విడత రాజకీయ ప్రాబల్య నిరూపణకు వేదికలుగా మారబోతున్నాయి. ఎస్ఎంసీల పేరుతో ప్రభుత్వ సూచన మేరకు జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఓటర్లు జాబితాను కూడా ప్రకటించారు. ఈ నెల 8న ఏలూరు నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ రంగ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించనున్నారు.

ఎస్ఎంసీ ఎన్నికల సందడి

ప్రభుత్వ ఆదేశాలతో ప్రారంభమైన ఎన్నికల నిర్వహణ సందడిగా మారింది. పాఠశాలలో సెక్షన్లు, మీడియంతో సంబంధం లేకుండా తరగతి యూనిట్‌గా ముగ్గురు సభ్యులను ఎన్నుకోవాలి. వీరిలో కనీసం ఇద్దరు మహిళలు, ముగ్గురిలో ఒకరు తప్పకుండా ఎస్సీ, ఎస్టీ, విభిన్న ప్రతిభావంతులు, మరొకరు బీసీ, ఈబీసీ, మైనార్టీకి చెందిన వ్యక్తి అయి ఉండాలి. తరగతి నుంచి సభ్యుల ఎన్నికకు 50 శాతం ఓటర్లు హాజరును రిజిస్టర్లో చూపిన తర్వాతే ఎన్నిక నిర్వహించారు. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు కూడా 50 శాతం సభ్యుల హాజరు ఉండాలి. క్లాసుల వారిగా ఎన్నికైన సభ్యులందరూ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులుగా ఉంటారు. వారంతా కలిసి కమిటీ వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. తరగతిలో కనీసం ఆరుగురు విద్యార్థులు లేకపోతే మరో తరగతిలోకి విలీనం చేసి ఎన్నుకోవాలి.

పరిశీలకులుగా అధికారులు

స్కూల్ కమిటీ ఎన్నికల్లో ప్రధానోపాధ్యాయులు ఎన్నికల అధికారిగా ఉంటారు. తహసీల్దార్, ఎంపీడీఓ, వీఆర్‌ఓలు ఎన్నిల పరిశీలకులుగా ఉంటారు. తల్లి, తండ్రి, పిల్లల సంరక్షకులుగా ఉన్న వారు ఓటర్లుగా ఉంటారు. గత సోమవారమే ఓటరు జాబితాపై అభ్యంతరాలు పూర్తయ్యాయి. ఈనెల 8వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటలోపు సభ్యులతోపాటు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహిస్తారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు కమిటీ తొలి సమావేశం నిర్వహించాలి. పాఠశాల విద్యా కమిటీలో ప్రతి సభ్యుడికీ రెండేళ్ల పదవీకాలం ఉంటుంది.

గత ప్రభుత్వంలో అభివృద్ధే లక్ష్యం

గత ప్రభుత్వంలో స్కూల్ కమిటీ సభ్యులు పాఠశాలల అభివృద్ధి కోసమే పని చేశారు. అప్పట్లో ప్రభుత్వం సైతం కమిటీలకు అధిక ప్రధాన్యత ఇస్తూ నాడు – నేడు పనులు కమిటీ సభ్యులకే అప్పగించారు. దీంతో ఆ పనులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగాయి. ప్రతి నెలా సమావేశం నిర్వహించి, విద్యార్థుల పురోగతి, పాఠశాల అభివృద్ధి పనులపై సమీక్ష చేసి, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకునేవారు. దీంతో పాఠశాలల అభివృద్ధితో పాటు విద్యార్థి అభ్యసనా సామర్థ్యాలు కూడా విశేషంగా పెరిగాయి. దానికి తోడు కమిటీ పెద్దలే విద్యార్థులను ప్రోత్సహించే నిమిత్తం దాతల నిధులు సమీకరించి వివిధ పోటీలు నిర్వహించడం, వారికి బహుమతులు ఇవ్వడం, విద్యార్థులకు అవసరమైన విద్యా విషయక వస్తువులను అందజేయడం వంటి మంచి కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రస్తుతం పెత్తనం కోసం

కొత్త ప్రభుత్వంలో కూటమి పార్టీల నాయకులు పాఠశాల ఎన్నికలపై దృష్టి సారించారు. ఆయా పాఠశాలలపై కూడా తమ పెత్తనాన్ని నిరూపించుకోవడానికి పాఠశాల ఎన్నికల్లో రాజకీయాలు చొప్పిస్తున్నారు. ఈ మేరకు కూటమికి చెందిన వారినే చైర్మన్, వైస్ చైర్మన్లుగా ఎన్నుకోవాలనే ప్రయత్నాలు సాగుతున్నాయి. అలాగే క్షేత్రస్థాయిలో పట్టు సాధించేందుకు రాజకీయ పార్టీలకు పాఠశాల ఎన్నికలు వేదిక కావడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు కూడా గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే విద్యారంగానికి సంబంధించి తల్లికి వందనం వంటి పథకాల అమలులో తీవ్రంగా విఫలమైన కూటమి నాయకులను తల్లిదండ్రులు ఏ మేరకు విశ్వసిస్తారో అనేది వేచిచూడాలి. కాగా పాఠశాల ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు దృష్టి సారించారు.

121 పాఠశాలల్లో ఎన్నికలు



ఏలూరు నియోజకవర్గంలో 121 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు ఉన్నాయి. వీటిలో మొత్తం 14,385 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఏలూరు రూరల్ మండలంలోని 57 పాఠశాలల్లో 5,741 మంది విద్యార్థులు, ఏలూరు అర్బన్ పరిధిలోని 64 పాఠశాలల్లో 8,644 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ పాఠశాలల్లో ఈనెల 8న ఎస్ఎంసీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. పాఠశాలల నోటీస్ బోర్డులో ఓటరు జాబితాలు ప్రదర్శించాం. ఓటరు జాబితాపై అభ్యంతరాలు కూడా స్వీకరిస్తున్నాం. విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో పారదర్శకంగా స్కూల్ కమిటీ ఎన్నికలు నిర్వహిస్తాం. – ఆర్ రంగయ్య, ఎంఈఓ 2

పాఠశాలకు కుర్చీల బహూకరణ



ఉపాధ్యాయులకు కుర్చీలు అందిస్తున్న విద్యార్థి తల్లిదండ్రులు

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి జెడ్పీ పాఠశాలకు దాతలు మంగళవారం కుర్చీలు బహూకరించారు. పూర్వ విద్యార్థి తల్లిదండ్రులు చింతపల్లి సాల్మన్‌రాజు, షారోను దంపతులు సుమారు రూ.15 వేలు విలువైన 20 కుర్చీలను హెచ్‌ఎం సుంకర వెంకటలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు, కె.మేరీ, ఎలిజబెత్, నారాయణం శివశంకర్, ఎన్ ఉషశ్రీ, వై.దుర్గ, ఎండీ యాస్మిన్, టి.వెంకటేశ్వరమ్మ తదితరులు దాతలను అభినందించారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్‌లో మంగళవారం జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు కేవీఆర్ ప్రసాద్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలోకి వెళ్లి పంట నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. పోలవరం నియోజకవర్గం కొయ్యలగూడెం మండలం గూటాల గ్రామంలో మొక్కజొన్న రైతులు దళారుల చేతిలో మోసపోయి తీవ్ర స్థాయిలో నష్టపోయారన్నారు. దాదాపు 137 మంది రైతులు రూ.2.25 కోట్లు మోసపోయారని, వారికి ఆ మొత్తాన్ని అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు సీహెచ్ విక్రమ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, నేరాల నిరోధానికి పటిష్ట చర్యలు



వాహన తనిఖీల్లో పాల్గొన్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్



విజిబుల్ పోలీసింగ్ చేస్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, నేరాల నిరోధానికి పటిష్టమైన చర్యలు చేపడతామని డీఎస్పీ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఏలూరు డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజు మంగళవారం నగరంలో స్వయంగా విజిబుల్ పోలీసింగ్ చేశారు. వాహన తనిఖీలు నిర్వహించారు. టూటౌన్ ప్రాంతంలో పవర్‌పేట రైల్వే గేటు రోడ్డు ప్రాంతంలో విస్తృతంగా మంగళవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలు నడిపే వారికి జరిమానాలు విధించారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా మోటారు సైకిళ్లు నడిపే మైనర్ల కుటుంబ పెద్దలకు ఫోన్ చేసి డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు ఇవ్వరాదని కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆటోలకు హెడ్ లైట్లు మాత్రమే వినియోగించాలని సూచించారు. అదనంగా ఏర్పాటు చేసిన లైట్లను అక్కడికక్కడే తీసివేసేలా చర్యలు చేపట్టారు. ఆటోవాలాలు యూనిఫామ్ లేకుండా వాహనాలు నడిపితే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. రాజకీయ నేతల పేర్లతో మోటారు సైకిళ్లకు నెంబర్ ప్లేట్లు ఉండకూదన్నారు. నెంబర్‌ప్లేట్ లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్లలో ప్రయాణించేవారు డ్రైవర్‌తోపాటు ముందు సీట్లతో కూర్చున్న వ్యక్తులు సీటు బెల్ట్ విధిగా ధరించాలన్నారు. కార్లను సైతం ఆపి డ్రైవింగ్ చేసే వారికి అవగాహన కల్పించారు. ఈ తనిఖీల్లో టూటౌన్ సీఐ ప్రభాకర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న గోవిందరావు

ఏలూరు టౌన్: వర్షాకాలం కావటంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏలూరు అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. ఏలూరు పవర్‌పేట యూపీహెచ్‌సీలో మంగళవారం యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గౌతమ్ ఆధ్వర్యంలో పవర్‌పేట, తంగెళ్లమూడి, ఆముదాల అప్పలస్వామి కాలనీ ఆరోగ్య, ఆశ కార్యకర్తలకు ఆశాడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా వర్షాకాలంలో టైఫాయిడ్ జ్వరాలు ప్రబలుతాయని, వీటిపై అశ్రద్ధ చేస్తే ప్రాణాపాయమని హెచ్చరించారు. ప్రజలు తాజా ఆహార పదార్థాలతోపాటు కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. డెంగీ జ్వరాలపై జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మంచి నీటి నిల్వల్లో పెరిగే డెంగీ కారకమైన ఏడిస్ ఈజిప్ట్ దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రజలు వారంలో ఒక రోజు ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా పరిశుభ్రం చేసుకోవాలని సూచించారు. డెంగీ జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఝాన్సీ, హెల్త్ అసిస్టెంట్ మేక శ్రీనివాసరావు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి పెంపు



ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీఓ ఖాజావలి

ఏలూరు (టూటౌన్): తల్లిపాల ద్వారా పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలి అన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతపై స్థానిక కలెక్టరేట్ నుంచి ఫైర్ స్టేషన్ వరకు, తిరిగి కలెక్టరేట్ వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఆర్డీఓ జెండా ఊపి ప్రారంభించారు. పుట్టిన బిడ్డకు మొదటి గంటలో తల్లి ముర్రిపాలు పట్టడం ఎంతో ముఖ్యమన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కేపీవీఎల్ పద్మావతి మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరిలో వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉండి తరచూ వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. రేపటి తరం వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఓ తూతిక శ్రీనివాస విశ్వనాథ్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఎం నాగేశ్వరరావు, డిప్యూటీ డెమో డి.నాగరత్నం, సీడీపీఓలు ఎ.పద్మావతి, కె.విజయలక్ష్మి, రాజశేఖర్, మల్లిక వైద్య సిబ్బంది బసవరాజు, తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లి పాలు అమృతం

ఏలూరు టౌన్: అప్పుడే జన్మించిన బిడ్డకు గంటలోపు తల్లి ఇవ్వడం ద్వారా అనారోగ్య బారి నుంచి రక్షణగా తల్లి పాలు అమృతంలా నిలుస్తుందని, వ్యాధినిరోధక శక్తిని పెంపొందింపజేస్తాయని ఏలూరు ప్రభుత్వాసుపత్రి సివిల్ సర్జన్ స్పెషలిస్టు, గైనకాలజిస్టు డాక్టర్ లిటోర్నదేవి అన్నారు. ఆసుపత్రిలోని ఎస్ఎన్ఎస్‌యూ విభాగానికి చెందిన డైటీషియన్లు పి కృష్ణపావని, పి సౌజన్యలు, నర్సింగ్ విద్యార్థులు కలిసి ఆసుపత్రిలోని బాలింతలకు, గర్భిణులకు తల్లిపాలపై అవగాహన కల్పించారు.

అమరుల పోరాటాలతో స్ఫూర్తి



సభలో మాట్లాడుతున్న శ్రీమన్నారాయణ

ఏలూరు (టూటౌన్): కారంచేడు, చుండూరు అమరుల పోరాట స్ఫూర్తితో కుల రహిత సమాజం నిర్మించాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది నంబూరి శ్రీమన్నారాయణ పిలుపు నిచ్చారు. కారంచేడు, చుండూరు అమరవీరులకు జోహార్లర్పిస్తూ భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఏలూరు ఏఎంసీ సమీపంలో హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఐఎఫ్‌టీయూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు అధ్యక్షతన సభ నిర్వహించారు. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ దళితులు, మహిళలు, చిన్నారులపై జరిగే హత్యలు, అత్యాచార ఘటనలను కార్మిక, ప్రజా ఉద్యమాల చైతన్యంతోటే పరిష్కారించుకోవాలని అన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ, ఉపాధ్యక్షుడు ఎస్ రామ్మోహన్, సీఎల్‌సీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ రత్నంలు మాట్లాడుతూ దళితులు, ఆదివాసీల ఆర్థిక పరిపుష్టి కోసం సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. భూమిలేని దళితులకు మూడెకరాలు ఇవ్వాలని, విద్యుత్ 300 యూనిట్లు వరకు ఉచితంగా ఇవ్వాలని, కార్పొరేషన్ల ద్వారా పూర్తి సబ్సిడీపై కార్లు, వ్యవసాయ పరికరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ స్టడీ సెంటర్‌లో ఉచితంగా గ్రూప్–1, –2 తదితర పోటీ పరీక్షలకు కోచింగ్ ఇవ్వాలని, డిగ్రీ, పీజీ విదేశీ విద్యకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలకు స్థలం ఉండి, ఇల్లు నిర్మించుకునే వారికి రూ.5 లక్షల సాయం చేయాలన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి మహర్షి, ఐఎఫ్‌టీయూ నగర కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు మాట్లాడారు.

11న విజయవాడలో సమావేశం

ఏలూరు రూరల్ : రిటైర్డ్ వీఆర్వో, పార్ట్‌టైం పంచాయతీ సెక్రటరీ, వీఏఓ, మాజీ విలేజ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఈ నెల 11వ తేదీన విజయవాడలో నిర్వహించనున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ సుబ్బారావు ఓ ప్రకటనలో తెలిపారు. గాంధీనగర్ హోటల్ శ్రీరామ్‌లో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, ప్రస్తుతం సంఘ సభ్యులు ఎదుర్కొంటున్న రేషన్‌కార్డుల పునరుద్ధరణ, పెన్షన్ల పెంపు తదితర సమస్యలపై చర్చిస్తామని పేర్కొన్నారు. జిల్లాల వారీగా నూతన కార్యవర్గాల ఎన్నికతో పాటు ఇటీవల మృతి చెందిన అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి స్థానంలో కొత్త కార్యదర్శిని ఎన్నుకుంటామని తెలిపారు.

క్రైస్తవ సంఘ కాపరులు ఐక్యంగా ఉండాలి



కార్యక్రమంలో పాల్గొన్న పాస్టర్లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): క్రైస్తవ సంఘ కాపరులంతా ఐక్యంగా ఉండాలని రోమన్ క్యాథలిక్ సంఘాల ప్రతినిధి ఫాదర్ ఐ.మైఖేల్ పిలుపునిచ్చారు. నూతనంగా ఏర్పడిన ఏలూరు సిటీ పాస్టర్ అసెంబ్లీ ప్రారంభోత్సవ కార్యక్రమం మంగళవారం స్థానిక శాంతినగర్ 7వ లైన్‌లోని కల్వరి చాపల్ (ఎలిఫజ్ చర్చి)లో నిర్వహించారు. బిషప్ కె.శాంతి సాగర్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఈ అసెంబ్లీని ఉన్నతమైన స్థితికి తీసుకువెళ్లాలని కోరారు. జీవన్ కుమార్ మాట్లాడుతూ ఏలూరు సిటీ పాస్టర్స్ అసెంబ్లీగా ఏర్పడటం ఒక మంచి పరిణామమన్నారు. అధ్యక్షుడు కె.సుదర్శన్ బాబు మాట్లాడుతూ ఏలూరు పట్టణ సంఘాలకు, సంఘ కాపరులకు అసెంబ్లీ ఎప్పుడు తోడుగా ఉంటుందని తెలిపారు. ఇక నుంచి ప్రతి నెలా జరిగే పాస్టర్ల అసెంబ్లీ సమావేశాలకు ఏలూరు పట్టణ దైవ జనులందరూ రావాలన్నారు. సీఎస్ఐ సంఘాల తరపున పెట్ల విజయరాజు, బాప్టిస్ట్ సంఘాల తరపున జాషువా, లూథరన్ చర్చి నుంచి పీపీఎస్ కిరణ్ తదితరులు పాల్గొని నూతన పాస్టర్ల అసెంబ్లీ ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు.

కొత్త నిబంధనలతోనే పని సర్దుబాటు చేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో ఉపాధ్యాయుల కొరత ఎదుర్కొంటున్న పాఠశాలల్లో పని సర్దుబాటు ప్రక్రియను 117 జీఓకు అనుగుణంగా, కాక నూతన నిబంధనలు రూపొందించి మాత్రమే చేయాలని పీఆర్‌టీయూ నాయకులు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ అబ్రహంను కోరారు. మంగళవారం డీఈఓను ఆయన కార్యాలయంలో కలిసిన వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిని సవరించి పని సర్దుబాటు చేయాలని, ఉపాధ్యాయ ఖాళీల్లో విద్యావాలంటీర్లను నియమించి కొరత తీవ్రతను నివారించాలని కోరారు. హైస్కూళ్లలో ప్లస్2 తరగతుల నిర్వహణలో నెలకొన్న సమస్యలను నివారించాలని, ముఖ్యంగా బోధనా సిబ్బందిని పదోన్నతులు ఇవ్వడం ద్వారా నియమించాలని పేర్కొన్నారు. ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులు వారి ఐచ్ఛికాన్ని పరిగణనలోకి తీసుకుని పబ్లిక్ పరీక్షలో మాధ్యమాన్ని ఎంచుకునే అవకాశం కల్పించాలని, 9వ తరగతి వరకు తెలుగు మీడియంలో చదివిన విద్యార్థులను బలవంతంగా ఇంగ్లీష్ మీడియంలో పరీక్షలు రాయించాలనుకోవడం తగదని వివరించారు. డీఈఓను కలిసిన వారిలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు, కార్యదర్శి రాంబాబు తదితరులున్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు



సదస్సులో మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కళాశాలల్లో ఎవరైనా విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టం తీవ్రంగా పరిగణిస్తుందని, అటువంటి చర్యలకు కఠిన శిక్షలు ఉన్నాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ర్యాగింగ్ నిషేధ, మాదకద్రవ్యాల నిరోధం చట్టాలపై, హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ ప్రతి కళాశాలలో ర్యాగింగ్ నివారణ కమిటీలను ఏర్పాటు చేసి, వాటి వివరాలను కళాశాలలో పొందుపరచాలని సూచించారు. ఎటువంటి సమస్యలు ఎదురైనా విద్యార్థులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచిత న్యాయ సహాయం అందిస్తుందని తెలిపారు. ప్రతి విద్యార్థీ అప్రమత్తంగా ఉండాలని, చెడు స్నేహాలకు పోకుండా సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. ద్విచక్ర వాహనచోదకులు వాహనం నడిపే వారే, కాకుండా తోటి ప్రయాణికులు కూడా హెల్మెట్ ధరించాలని సూచించారు. సదస్సులో ప్యానల్ లాయర్ కూన కృష్ణారావు, కళాశాల ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎం రాంబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

సస్పెండ్ అయిన వారికి ఉద్యోగాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో వివిధ సర్కిళ్లలో పని చేస్తూ ఏసీబీ కేసుల్లో సస్పెండ్ అయిన ఉద్యోగులకు రాష్ట్ర ఎనర్జీ సెక్రటరీ ఆదేశాల మేరకు తిరిగి ఉద్యోగాలు కల్పిస్తూ సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఈపీడీసీఎల్ డిస్కం పరిధిలో ఆరుగురికి ఉద్యోగాలు ఇవ్వగా, వీరిలో ఏలూరు సర్కిల్‌కు చెందిన ఇద్దరు ఉద్యోగులున్నారు. దర్భగూడెంలో ఏఈఈగా పని చేసిన పులిచేరు సాంబయ్యను ఏలూరు సర్కిల్‌లోనే బయ్యనగూడెం ఏఈఈగా నియమించారు. దెందులూరులో ఏఈగా పని చేసిన మల్లుల రమేష్ బాబును విజయరాయి ఏఈగా నియమించారు.